సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం ׀ 25 ׀ జూలై ׀ 2023



జూరాలకు తగ్గిన వరద

ప్రియదర్శిని జూరాలకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది.

వివరాలు 8లో ▸



ఆర్‌యూబీ పనులు షురూ

జడ్చర్ల రైల్వేస్టేషన్ వద్ద ఆర్‌యూబీ పనులు చురుకుగా సాగుతున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.5 /21.3

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే ముసురు కమ్ముకుంటుంది. అడపాదడపా భారీ వర్షం కురవొచ్చు.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా సీతారామారావు



సాక్షి, నాగర్‌కర్నూల్: అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా సీతా రామారావును ప్రభుత్వం సోమవారం నియమించింది. కొమరంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉన్న ఆయనను నాగర్‌కర్నూల్‌కు బదిలీ చేసింది. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా ఇరిగేషన్ స్పెషల్ కలెక్టర్ డి.వేణు ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బదిలీ అయ్యారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల దరఖాస్తుకు నేడే ఆఖరు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు మంగళవారం సాయంకాలం వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ సూచించారు. 24 వతేదీ చివరి గడువు ఉన్నప్పటికీ, వర్షాల కారణంగా చాలామంది దరఖాస్తులు చేసుకోలేకపోయారని, మరో రోజు గడువు పెంచినట్లు ఆయన వివరించారు. తెలుగు, ఇంగ్లిష్, కామర్స్, చరిత్ర, రాజనీతిశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

కందనూలు: జిల్లా కేంద్రంలోని నెల్లికొండ గేట్ సమీపంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కమర్ షాజహాన్ సుల్తానా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్, డైరీ సైన్స్ సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు, నెట్, సెట్,పీ హెచ్‌డీ ఉండి బోధనా అనుభవం గల వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఈనెల 26వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కనీస అభ్యసన సామర్థ్యాలు నేర్పించాలి



కందనూలు: విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు నేర్పించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. ఎఫ్ఎల్ఎన్‌లో భాగంగా 1వ తరగతి నుండి 5 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం,గణితం విషయ బోధన ప్రణాళికలు, అభ్యాస పుస్తకాలపైన మూడు రోజుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం సోమవారం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సబ్జెక్టు, తరగతుల వారీగా అభ్యసన ఫలితాల సాధనను దృష్టిలో పెట్టుకుని ఈ శిక్షణ కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఇది వరకే ఉపాధ్యాయులకు లెసన్ ప్లాన్, విద్యార్థులకు వర్క్ బుక్స్ అందించడం జరిగిందని, వీటిని సక్రమంగా వినియోగిస్తూ బోధనా అభ్యసన ప్రక్రియను అర్థవంతంగా కొనసాగించేలా మండల స్థాయిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని డీఆర్పీలకు సూచించారు. అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ ఎండి షర్ఫుద్దీన్, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వృత్తి నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో వచ్చేనెల 1వ తేదీ తేదీ నుంచి 11వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్‌పై మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్స్ (ఎంఎస్ ఆఫీస్), బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెట్ తయారీ, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనర్ రిపేర్, మొబైల్ సర్వీసింగ్, రిపేర్ అంశాల్లో, 7వ తరగతి పాస్‌పై జర్దోసీ-మగ్గం, ఎలక్ట్రీషియన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం హైదరాబాద్ సెట్విన్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణత అయిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు వృత్తి నైపుణ్య శిక్షణకేంద్రంలో దరఖాస్తుతో పాటు విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కులం సర్టిఫికెట్లను అందజేయాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని, మిగతా వివరాల కోసం శిక్షణ కేంద్రం ఇన్‌చార్జీ ఎస్.విజయ్‌కుమార్ (9441565895)ను సంప్రదించాలని సూచించారు.

హస్తవ్యస్తం!

కాంగి'రేసు'లో లొల్లి

- ముదురుతున్న చేరికల పంచాయితీ
- పాత, కొత్త నేతల మధ్య టికెట్ల కుంపటి
- అభ్యర్థిత్వాలపై ఎవరికి వారు పట్టు
- పలు సెగ్మెంట్లలో బాహాటంగానే విమర్శనాస్త్రాలు
- కొన్ని చోట్ల కొనసాగుతున్న అంతర్గత పోరు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఎన్నికల పోరుకు సమాయత్తమవుతున్న కాంగ్రెస్‌లో చేరికలు చిచ్చురేపుతున్నాయి. కీలక నేతల చేరికలతో పార్టీని బలోపేతం చేసే దిశగా పెద్దలు అడుగులు వేయగా.. ఉమ్మడి పాలమూరులో పాత, కొత్త నాయకుల మధ్య పంచాయితీకి ఆజ్యం పోసింది. అభ్యర్థిత్వాలపై ఎవరికి వారు పట్టు కొనసాగిస్తుండగా.. అసమ్మతి రాజుకుంటోంది. పలు నియోజకవర్గాల్లో ఇరువర్గాల నేతల అనుచరులు పరస్పర విమర్శలకు దిగుతుండడం రాజకీయాలను హీటెక్కిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎవరికి వారు ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తుండడం పార్టీకి నష్టం కలిగిస్తుందనే అభిప్రాయం కార్యకర్తల్లో నెలకొంది. సర్వే ఫలితాలే ఫైనల్ అంటూ అధిష్టానం మిన్నకుండిపోవడంపై హస్తం శ్రేణుల్లో గందరగోళం నెల కొంది.



వేడెక్కిన కొల్లాపూర్, నాగర్‌కర్నూల్

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలకు చెందిన సీనియర్ నేతలు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఆయన తనయుడు కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఈ నెల 30న కొల్లాపూర్‌లో జరిగే ప్రజాభేరి బహిరంగసభలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకా గాంధీ సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల్లో 'చేతి'ని కష్టకాలంలో అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నేత నాగం జనార్దన్‌రెడ్డితో పాటు జగదీశ్వర్‌రావులో అసంతృప్తి నెలకొంది. వచ్చే ఎన్నికల్లో పోటీచేసేందుకు సిద్ధమవుతున్న వారిలో అసహనం పెల్లుబికుతుండగా.. స్వరం పెంచారు. ఇటీవల కొల్లాపూర్‌లో సీనియర్ నాయకుడు మల్లురవి ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో కార్యకర్తల సమావేశం వాడీవేడిగా సాగింది. కాంగ్రెస్ నుంచి గెలిచిన నాయకులు పార్టీని వదిలి పెట్టిన సందర్భంలో, కష్టకాలంలో పనిచేసిన జగదీశ్వర్‌రావుకే సీటు ఇవ్వాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. వేరే వారికి సహకరించేంది లేదనే సంకేతాలు ఇచ్చారు. ఇదే విషయాన్ని నాగం జనార్దన్‌రెడ్డి సైతం స్పష్టం చేశారు. సర్వేల ఆధారంగానే సీట్లు కేటాయింపులు ఉంటాయని మల్లురవి చెప్పినా.. కార్యకర్తలు వ్యతిరేకించారు.

కల్వకుర్తి నియోజకవర్గం

■ కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డియేనని మొదటి నుంచి అందరూ భావించారు. అయితే ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వచ్చిన తర్వాత లొల్లి మొదలైంది. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సూచన మేరకే సుంకిరెడ్డి కల్వకుర్తి నియోజకవర్గంలో ఫౌండేషన్ పేరిట కార్యక్రమాలు ఆరంభించి.. ప్రజలకు చేరవయ్యాడని ప్రచారంలో ఉంది. ఆయన పార్టీలో చేరే విషయం ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డికి తెలియకుండా జాగ్రత్త పడడం వివాదానికి దారితీసినట్లు చర్చ జరుగుతోంది. దీనిపై వంశీచంద్.. జూపల్లితో పాటు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వద్ద సైతం ఆరా తీసినట్లు తెలిసింది. కాగా.. సుంకిరెడ్డికే టికెట్ వస్తుందని ఆయన వర్గీయులు ప్రచారం చేస్తున్న క్రమంలో కల్వకుర్తి కాంగ్రెస్‌లో టికెట్ లొల్లి మొదలైనట్లు తెలుస్తోంది.

గద్వాల

■ గద్వాల జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. జెడ్పీ చైర్మన్ పదవిని వదులుకుని కాంగ్రెస్‌లో చేరిన ఆమెకే గద్వాల నియోజకవర్గ టికెట్ ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజీవ్‌రెడ్డిలో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

వనపర్తి

■ వనపర్తిలో మాజీ మంత్రి చిన్నారెడ్డిపై స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి నెలకొంది. ఆ పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేశారు. మారిన రాజకీయ పరిణామాల క్రమంలో వనపర్తి, పెద్దమందడి ఎంపీపీలు మేఘారెడ్డి, కిచ్చారెడ్డి తదితరులు జూపల్లి వెంట కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మేఘారెడ్డికే వనపర్తి టికెట్ అనే ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలు చిన్నారెడ్డితో పాటు ఆయన అనుచరుల్లో అసహనానికి గురిచేసినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మక్తల్

■ మక్తల్‌లో బీసీ కోటాలో తనకే కాంగ్రెస్ టికెట్ వస్తుందని ముదిరాజ్ వర్గానికి చెందిన వాకిటి శ్రీహరిలో ధీమా వ్యక్తమవుతోంది. అయితే మాజీ ఎమ్మెల్యే, ఆప్కాబ్ మాజీ చైర్మన్ వీరారెడ్డి తనయుడు ప్రశాంత్ కుమార్ సైతం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి నాగరాజుగౌడ్ సైతం టికెట్ ఆశిస్తున్నారు.

దేవరకద్ర

■ దేవరకద్ర నుంచి డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్ సైతం పోటీపడుతున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో జరిగిన బీసీ సదస్సులో ఆయన మాట్లాడుతూ పోటీకి అవసరమైన డబ్బు లేదనే ప్రచారం చేస్తున్నారు.. ఎంత డబ్బు కావాలో చెబితే డిపాజిట్ చేస్తానని.. ఈసారి టికెట్ ఇవ్వకుంటే ఊరుకునేది లేదని వ్యాఖ్యానించడం పరిస్థితిని స్పష్టం చేస్తోంది. వీరేకాకుండా యువత కోటాలో తనకు అవకాశం ఇవ్వాలని కొండా ప్రశాంత్‌రెడ్డి సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. అయితే గతంలో మాజీ మంత్రికి ముఖ్య అనుచరుడిగా ఉండి.. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన ఓ నాయకుడు సైతం హస్తం గూటికి చేరనున్నట్లు ప్రచారం జరుగుతుండడంతో నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో అయోమయం నెలకొంది.

జడ్చర్ల, మహబూబ్‌నగర్

■ జడ్చర్ల నియోజకవర్గంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ మధ్య పోటాపోటీ నెలకొంది. అనిరుధ్‌రెడ్డి ప్రజాహిత పాదయాత్ర పేరిట నియోజకవర్గంలో అన్ని మండలాలను చుడుతున్నారు. తొలినుంచి తాను కాంగ్రెస్‌లో ఉన్నానని.. పార్టీ కార్యక్రమాలు, ప్రజా ఆందోళనల్లో చురుగ్గా పాల్గొంటున్న తనకే టికెట్ వస్తుందనే ధీమా ఆయనలో వ్యక్తమవుతోంది. అదేవిధంగా మహబూబ్‌నగర్‌లో డీసీసీ మాజీ అధ్యక్షుడు, పీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ టికెట్‌ను ఆశిస్తున్నారు. అయితే బీజేపీకి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు, ఆయనకే అభ్యర్థిత్వం ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండడంతో వారిలో అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.

మన ఊరు – మన బడి పనుల్లో వేగం పెంచాలి

- సెప్టెంబర్ 30 నాటికి అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు
- పనుల నాణ్యతలో రాజీపడొద్దు
- కలెక్టర్ ఉదయ్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూలు: జిల్లాలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద మొదటి విడతగా చేపట్టిన 290 పాఠశాలల్లో చేపట్టిన పనులు సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం సమావేశమై మాట్లాడారు. మన ఊరు మన బడి పనులను ఆయా ఇంజినీరింగ్ శాఖాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆయా ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.30లక్షలలోపు అంచనా గల 217 పాఠశాలలు, రూ.30 లక్షలు పైగా అంచనాగల 73 పాఠశాలల వారీగా పనుల పురోగతి ఎప్పటివరకు పూర్తి చేస్తారో అనే వివరాలను ఏఈ వారీగా సమీక్షించారు. ఇప్పటివరకు రూ.15 కోట్లు విడుదల చేశామని, అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయిస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని, రాజీ పడవద్దన్నారు. మండలాల వారీగా పురోగతి పనులను సమీక్షించి జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లో పూర్తి అయ్యేలా లక్ష్యం నిర్ణయించారు. జిల్లాలో రెండో విడత పాఠశాలలను సైతం ఆగస్టులో ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీఈఓ గోవిందరాజులు, ఈఈలు దామోదర్ రావు, రామచంద్ర రావు, డిప్యూటీ ఈఈలు దుర్గాప్రసాద్, ప్రతాప్, నాగలక్ష్మి, నయుముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: నియోజకవర్గ పరిధిలోని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఉచితంగా టూ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్‌లు ఇప్పించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ట్రస్ట్ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చాలా మంది యువకులు రోడ్డు భద్రతపై అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారని, అలాంటి యువకుల కోసం లైసెన్స్‌లు ఇప్పించడమే కాకుండా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనున్నామన్నారు. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లాలో కేవలం 40 స్లాట్‌లు మాత్రమే బుక్‌చేసుకునే అవకాశం ఉందని, దీన్ని రవాణా శాఖ కమీషనర్‌తో మాట్లాడి 150కి పెంచేవిధంగా ప్రయత్నించనున్నట్లు తెలిపారు. యువతీ యువకులకు మొదట లర్నింగ్ లైసెన్స్‌లు ఇవ్వడంతోపాటు 45 రోజుల్లో పర్మినెంట్ లైసెన్స్‌లు ఇప్పించనున్నట్లు తెలిపారు. మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చినట్లు తెలిపారు. ఒక్కో లైసెన్స్‌కు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుందని ఈ ఖర్చు మొత్తం ఎంజేఆర్ ట్రస్ట్ భరిస్తుందని అన్నారు. అనంతరం కేటీఆర్ పుట్టిన రోజుసందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కుర్మయ్య, మున్సిపల్ చైర్మన్ కల్పనా, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తోపాటు ఈశ్వర్‌రెడ్డి, బంగారయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేదలకు వరం

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నియోజకవర్గంలోని మొత్తం 225 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే, 111 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై విచారణ



కోమటికుంట పాఠశాలలో విచారిస్తున్న ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ఎం

లింగాల: మండలంలోని కోమటికుంట పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటేష్ విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీరుపై సోమవారం ఎంఈఓ చంద్రుడు, అంబట్‌పల్లి కాంప్లెక్స్ హెచ్ఎం తాహెర్‌పాష విచారణ జరిపారు. ఉపాధ్యాయుడు వెంకటేష్ బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఈ నెల 14న చితకబాదిన సంఘటన విదితమే. దీంతో విద్యాశాఖ స్పందించింది. డీఈఓ ఆదేశాల మేరకు ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ఎం పాఠశాలను సందర్శించి వేర్వేరుగా విద్యార్థినులను, పాఠశాల హెచ్ఎం అంజిలాల్, ఉపాధ్యాయులను విచారించారు. సదరు నివేదికను డీఈఓకు సమర్పించనున్నట్లు, తదుపరి ఆదేశాల మేరకు సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక సెలవుపై ఉన్నట్లు తెలిసింది.

ప్రజావాణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి



అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్రీవిద్య

నాగర్‌కర్నూల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసి సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అడిషనల్ కలెక్టర్ 166 వినతులు స్వీకరించారు. అందులో 120 ధరణివి కాగా 46 గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్, మున్సిపల్, మహిళా శిశు సంక్షేమ, బీసీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందినవి అని తెలిపారు. వినతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి సమస్యలు పరిష్కరించి సంబంధిత వెబ్‌పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని, తమ పరిధిలో లేని వాటిపై ఫిర్యాదుదారులకు తగు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సింగ్ రావు, ముఖ్య ప్రణాళిక అధికారి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలుకుబడి ఉన్న వారికే..

కందనూలు: మహిళ శిశు సంక్షేమ శాఖకు సంబంధించి ఔట్‌సోర్సింగ్ పద్ధతిన చైల్డ్ లైన్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీల్లో మెరిట్ ప్రకారం సెలెక్ట్ చేస్తామని చెప్పి ఎలాంటి అనుభవం, మెరిట్ లేని, రాజకీయ పలుకుబడి ఉన్నవాళ్లనే సెలెక్ట్ చేసి ఉద్యోగాలు ఇచ్చారని బాధితురాలు శ్రీవిద్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ దీపక్ కుమార్‌ను కలిసి గోడు వెల్లబోసుకుంది. తనకు ఇదే విభాగంలో పని అనుభవంతోపాటు స్టడీ ఉందని, అన్ని రకాలుగా అర్హురాలిగా ఉన్న తనని కాదని, అనుభవం లేని వారికి, ఒకే ఇంట్లో ఇద్దరికి ఒకే రకమైన ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. అవకతవకలపై విచారణ చేసి, భర్త, తండ్రి తోడు లేని, అర్హురాలినైన తనని ఉద్యోగానికి ఎంపిక చేయాలని కోరారు.

పేదరికాన్ని తగ్గించిన ఘనత కేసీఆర్‌దే..



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి: గతంతో పోలిస్తే రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 75 కుట్టుమిషన్లు, 60 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలను రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. వినూత్న ఆలోచనలతో మున్సిపాలిటీలలో మంత్రి కేటీఆర్ అమలు చేస్తున్న పథకాలు దేశస్థాయిలో గుర్తింపు రావడంతోపాటు రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందించిందని గుర్తు చేశారు. అనంతరం కల్వకుర్తిలో ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా పాలమూరు చౌరస్తాకు చేరుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్‌కట్ చేశారు. మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, అశోక్‌రెడ్డి, సంజీవ్ యాదవ్, మాజీ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

హామీల అమలులో కేసీఆర్ ప్రభుత్వం విఫలం



బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావును అరెస్టు చేస్తున్న పోలీసులు

కందనూలు: హామీల అమలులో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని.. హామీల ముఖ్యమంత్రికి విడాకులు ఇద్దామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నా చేశారు. అంతకుముందు పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈసందర్భంగా ఎల్లేని సుధాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 23 లక్షల కుటుంబాలకు సొంత ఇల్లు లేదని, డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి నేటికి పదేళ్లు కావస్తున్నా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. దళితులకు మూడెకరాల భూమి, రుణమాఫీ,దళిత బంధు, బీసీలకు రూ.లక్ష సాయం ఇలా చెప్పుకుంటే పోతే ఎన్నో పథకాలు అమలు చేస్తామని హామీలు ఇవ్వడం ఎన్నికల్లో గెలిచాక మరిచిపోవడం పరిపాటిగా మారిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గడచిన తొమ్మిదేళ్లలో అనేక హామీలను నెరవేర్చిందని గుర్తుచేశారు. కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు జాతీయ రహదారి, మామిడిపండ్ల మార్కెట్ మన జిల్లాకు ఇచ్చారని చెప్పారు. కమీషన్లు రాకనే, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దిలీప్ అన్నారు. చెప్పే మాటలకు చేసే పనులకు ఎంతో వ్యత్యాసం ఉందని సతీష్ మాదిగ అన్నారు. బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసే క్రమంలో తోపులాట, కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్యక్రమంలో కొండ మణెమ్మ, మంగ్యా నాయక్, సుధాకర్‌రెడ్డి, జానకి, బాలాజీ,రాజు,కొండ నగేష్, చందు, నరేష్ పాల్గొన్నారు.

చీడ, పీడల నుంచి పంటలను కాపాడుకోవాలి



వెల్దండలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న డీఏఓ వెంకటేశ్వర్లు

వెల్దండ: తగు జాగ్రత్తలు పాటించి పంటలకు సోకుతున్న చీడ, పీడల నుంచి కాపాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం వెల్దండలో మొక్కజొన్న, పత్తి, జొన్న తదితర పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్తిపంట వివిధ దశల్లో ఉండడంతో పంటలకు పురుగు సోకే అవకాశం ఉందని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు ఆశిస్తుందని, తెగుళ్లను గుర్తించి పంటలకు మందులను పిచికారీ చేయాలన్నారు. ముసురు వర్షాలతో తెగుళ్ల సోకే ప్రమాదం అధికంగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వరి పంటల సాగులో మెలకువలు పాటించాలని, తగినంత ఎరువులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ మంజుల, ఏఈఓ సురేష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

వనపర్తి పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

వనపర్తిటౌన్: వనపర్తిలో కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 విద్యాసంవత్సరం స్పాట్ అడ్మిషన్లకుగాను మంగళవారం నుంచి ఈ నెల 27 వరకు మూడురోజుల పాటు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ డా. కె.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 28న మెరిట్ లిస్ట్ ప్రకటిస్తామని.. ఎంపికైన విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఫీజు చెల్లించి ప్రవేశాలు పొందాల్సి ఉంటుందన్నారు.

క్లుప్తంగా

నలుగురికి సీఐలుగా పదోన్నతి



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న నలుగురు ఎస్‌ఐలకు రాష్ట్ర హోంశాఖ సీఐలుగా పదోన్నతి కల్పించింది. ఇందులో 2009 బ్యాచ్‌కు చెందిన వారు ముగ్గురు కాగా 2012 బ్యాచ్‌కు చెందిన ఒకరు ఉన్నారు. వీఆర్‌లో ఉన్న సైదయ్య, మోహన్‌బాబు, సీసీఎస్‌లో పనిచేస్తున్న రామకృష్ణ, బాలకృష్ణలకు సీఐలుగా పదోన్నతులు వచ్చాయి. వీరిని సోమవారం ఎస్పీ కె.నరసింహ అభినందించారు. పదోన్నతి వచ్చిన తర్వాత మరింత బాధ్యత పెరుగుతుందని, విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఇద్దరికి జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: గొడవపడిన కేసులో ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్షతో పాటు ఒకరికి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. మహబూబ్‌నగర్‌లోని హనుమాన్‌పురకు చెందిన శిరీష ఓ గొడవకు సంబంధించి 2021లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ జగన్నాథం ఈ కేసులో విచారణ చేసి ఏ1 కొండయ్య, ఏ2 రాజశేఖర్, ఏ3 సత్యమ్మలను సోమవారం జిల్లా కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి శ్రీదేవి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ఏ1 కొండయ్య, ఏ2 రాజశేఖర్‌లకు ఒక్కొక్కరికి 15 నెలల జైలు శిక్ష విధించగా, ఏ3 సత్యమ్మకు రూ.2వేల జరిమానా విధించారు. శిక్ష పడిన వారిని జిల్లాజైలుకు తరలించారు.

ఇద్దరు వాహనదారులకు జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు చేసిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో చంద్రశేఖర్, నరేందర్ మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సోమవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి డి.నిర్మల, ఒకరికి మూడురోజుల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా, మరో వాహనదారుడికి రెండురోజుల జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఆ తర్వాత సదరు ఇద్దరూ వాహనదారులను వన్‌టౌన్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. అలాగే మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు చేసిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 8మందికి రూ.22,500 జరిమానా విధించారు.

మహిళ బలవన్మరణం



ఈశ్వరమ్మ (ఫైల్)

అయిజ: ఉరేసుకొని ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని ఉత్తనూరుకు చెందిన పరమేష్ కుటుంబం వాటర్ ప్లాంట్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. పరమేష్ అతడి ఇద్దరు కుమారులు రోజులాగే సోమవారం ఆటో తీసుకొని అయిజకు వెళ్లి ఫిల్టర్ వాటర్‌ను విక్రయించుకొని తిరిగి ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచి చూడగా పరమేష్ భార్య ఈశ్వరమ్మ (45) ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని కనిపించింది. వెంటనే కిందకు దించి పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. ఈ విషయాన్ని ఎస్‌ఐ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. ఎవరూ ఫిర్యాదు చేయలేదని వివరించారు. మహిళ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

పాన్‌గల్: ప్రమాదవశాత్తుతో ట్రాక్టర్‌పై నుంచి బాలుడు కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన సంఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ రవిప్రకాష్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ, గాలెన్న దంపతుల కుమారుడు శ్రీశైలం(16) ఇదే గ్రామానికి చెందిన సురేందర్ ట్రాక్టర్‌పై వెళ్తూ గత నెల 24వ తేదీన ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదు ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా నెల రోజుల పాటు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి గాలెన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే



అలంపూర్: హైదరాబాదులో ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ను ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం సోమవారం కలిశారు. ఆయనతో పాటు ఆర్డీఎస్ ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ తనగల సీతారామిరెడ్డి, సోమనాద్రి విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్ రెడ్డి కలిశారు. పార్టీ కోసం కృషి చేస్తున్న వారికి సముచిత స్థానం కల్పించాలని ఎమ్మెల్యే కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ పార్టీ కోసం కష్టపడిన వారికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.

ఇన్‌చార్జ్‌ల పాలనకు స్వస్తి

జిల్లా క్రీడాశాఖాధికారులుగా సీనియర్ పీడీలు

- సీనియర్ పీడీలకు ఎఫ్‌ఏసీ డీవైఎస్‌ఓలుగా అవకాశం
- మహబూబ్‌నగర్ మినహా నాలుగు జిల్లాలకు డీవైఎస్‌ఓల నియామకం
- కొత్త జిల్లాల్లో పరుగులు పెట్టనున్న క్రీడారంగం



మహబూబ్‌నగర్ జిల్లా స్టేడియంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: ప్రభుత్వం క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. జిల్లాల్లో క్రీడాభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నారు. స్టేడియంల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. మూడేళ్ల తర్వాత ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో క్రీడారంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే క్రీడానేపథ్యం ఉన్న వారిని అధికారులుగా నియామకానికి శ్రీకారం చుట్టింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినే తర్వాత కొత్త జిల్లాల్లో ఇన్‌చార్జ్‌ల పాలనలోనే కొనసాగుతున్న క్రీడా శాఖ అధికారుల స్థానంలో పూర్తిస్థాయి అధికారులను (ఎఫ్‌ఏసీ) నియామకం చేసేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. జిల్లాల్లో సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ జిల్లా యువజన క్రీడా శాఖ అధికారులుగా నియామకానికి శ్రీకారం చుట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాకు ఇప్పటికే రెగ్యులర్ డీవైఎస్‌ఓగా ఎస్.శ్రీనివాస్ కొనసాగుతుండగా కొత్త జిల్లాల్లో సీనియర్ పీడీలను (ఎఫ్‌ఏసీ) డీవైఎస్‌ఓలుగా నియామకం చేశారు.

కొత్త జిల్లాల్లో డీవైఎస్‌ఓలు..

నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాలకు సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను ఆయా జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులుగా నియామకం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా డీవైఎస్‌ఓగా తాడూర్ జెడ్పీహెచ్ఎస్ పీడీ సీతారాం, వనపర్తి జిల్లా డీవైఎస్‌ఓగా పాన్‌గల్ జెడ్పీహెచ్ఎస్ పీడీ సుధీర్‌కుమార్‌రెడ్డి నియామకం అయ్యారు. సుధీర్ కుమార్‌రెడ్డి మూడేళ్లపాటు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. గద్వాల జిల్లా డీవైఎస్‌ఓగా సీనియర్ పీడీ బీఎస్.ఆనంద్‌కుమార్ నియామకం అయ్యారు. ఆనంద్‌కుమార్ గద్వాల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శిగా మూడేళ్లపాటు పనిచేశారు. నారాయణపేట జిల్లా మాగనూర్ జెడ్పీహెచ్ఎస్ పీడీగా పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్‌ను డీవైఎస్‌ఓగా నియమించారు. ఇప్పటికే వీరు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులుగా బాధ్యతలు చేపట్టారు.

కార్యాలయాల్లో సిబ్బంది కొరత..

కొత్త జిల్లాల్లో డీవైఎస్‌ఓలుగా నియమించినప్పటికీ ఈ జిల్లాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తుంది. కొన్ని కార్యాలయాల్లో కనీసం క్లరికల్ పోస్టులు కూడా లేకపోవడంతో రోజువారి నిర్వహణ కష్టతరంగా మారింది. కొత్త జిల్లాల్లో ప్రత్యేక క్రీడాశాఖలు ఏర్పాటు చేసినా నిధుల విడుదల కూడా అంతంత గానే ఉంది. జిల్లా యువజన, క్రీడాశాఖకు క్రీడానేపథ్యం ఉన్న వారిని డీవైఎస్‌ఓలుగా నియామకం చేయడం సంతోషంగా ఉందని, కార్యాలయల్లో సరిపడా సిబ్బంది నియామకం కూడా చేపట్టాలని సీనియర్ క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.

క్రీడాభివృద్ధికి కృషి



డీవైఎస్‌ఓగా అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉంది. ఇటీవలే హాకీంపేట రాష్ట్రస్థాయి స్పోర్ట్స్‌స్కూల్‌కు సంబంధించి జిల్లాస్థాయిలో ఎంపికలు నిర్వహించాం. జిల్లాలో క్రీడల పరంగా ఎప్పటికప్పుడూ సమాచారం అందిస్తాం. జిల్లాలో క్రీడాభివృద్ధికి నావంతు కృషి చేస్తా.

– సీతారాం, డీవైఎస్‌ఓ, నాగర్‌కర్నూల్

క్రీడాకారుడిగా గర్వంగా ఉంది..



క్రీడాకారుడిగా నాకు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారిగా నియామకం చేయడం చాలా గర్వంగా ఉంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా. క్రీడల పరంగా రాష్ట్రంలోనే వనపర్తి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతా.

– సుధీర్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ, వనపర్తి

జూరాలకు తగ్గిన వరద



లిఫ్టు-1 వద్ద కొనసాగుతున్న నెట్టెంపాడు నీటి పంపింగ్

- జెన్‌కో కేంద్రంలో విద్యుదుత్పత్తి నిలిపివేత
- కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్
- ఆలమట్టికి 1,14,445 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టింది. ఆదివారం ప్రాజెక్టుకు 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సోమవారం సాయంత్రానికి కేవలం 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రవాహం తగ్గడంతో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. కాగా నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో రెండు పంపులను ప్రారంభించి 1500 క్యూసెక్కులను ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపుతున్నారు. ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-2 ద్వారా 750 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1 ద్వారా 1,300 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి 4,537 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 9.657టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.107 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే ఎగువ ప్రాంతంలో ఆలమట్టి ప్రాజెక్టు నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 64.41 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 1,14,445 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ప్రాజెక్టు నుంచి 6,761 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుం ప్రాజెక్టులో 19.09 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ప్రాజెక్టుకు 13,675 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 50 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

■ దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో రెండు రోజులుగా 2.643 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించినట్లు ఎస్‌ఐ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి చేపట్టామని, వరద తక్కువగా ఉండడంతో దాన్ని నిలిపివేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో నీటిమట్టం చేరిన తర్వాత 12 యూనిట్ల ద్వారా 490 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపడుతామని చెప్పారు.

శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు

దోమలపెంట/మదనాపురం/ఎర్రవల్లిచౌరస్తా: శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేసి, వరద నీటిని దిగువకు వదులుతుండడంతో నది నీటిలో కళకళలాడుతోంది. ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుష్కరఘాట్ వద్దకు వరద నీరు చేరింది. శ్రీశైలం జలాశయంలో సోమవారం సాయంత్రానికి 812.0 అడుగుల నీటిమట్టం, 35.4770 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గడిచిన 6,664 క్యూసెక్కుల నీటి ప్రవాహం జలాశయంలోకి చేరాయి.

■ వనపర్తి జిల్లా మదనాపురం మండలం రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు కాగా.. సోమవారం సాయంత్రం 1,020 అడుగుల మేర నీరు ఉంది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.



శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

ఎంవీఎస్ డిగ్రీ కళాశాల సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)కు సంబంధించి డిగ్రీలో రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ల పరీక్ష ఫలితాలను సోమవారం పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ లక్ష్మీకాంత్‌రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజామంగ తాయారు, ప్రిన్సిపాల్ పద్మావతి విడుదల చేశారు. గ్రూపుల వారీగా ఉత్తీర్ణత వివరాలు ఇలా ఉన్నాయి. బీఏలో 200 విద్యార్థులకు గాను 179మంది (89.50శాతం), బీబీఏలో 33మందికి గాను 29మంది (87.88శాతం), బీకామ్‌లో 211మందికి గాను 175 మంది (82.94 శాతం), బీఎస్సీ సైన్స్‌లో 520మంది విద్యార్థులకు గాను 410మంది (78.84శాతం) ఉత్తీర్ణులయ్యారు. కార్యక్రమంలో పీయూ అడిషనల్ కంట్రోలర్ రాజ్‌కుమార్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ రాములు, అడిషనల్ కంట్రోలర్లు ఎం.మల్లికార్జున, సూర్యనారాయణ, న్యాక్ కో- ఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

పాలమూరు: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ ఆస్పత్రి, హైదరాబాద్ అపోలో స్పెక్ట్రా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సీనియర్ గుండె వైద్య నిపుణులతో గుండె పరీక్షలు, చికిత్స, సర్జరీలు ఆరోగ్య శ్రీ ద్వారా చేయనున్నట్లు తెలిపారు.

భగవాన్ జిహ్వేశ్వర జయంతికి ఆహ్వానం



గద్వాల: జిల్లాలో జరిగే భగవాన్ జిహ్వేశ్వర జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్ ధోత్రే వెంకటేషను గద్వాల జిల్లా స్వకుళసాళి సేవా సంఘం నాయకులు ఆహ్వానించారు. సోమవారం సంఘం నాయకులు మహబూబ్‌నగర్‌లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి వేడుకలను సంబంధించిన వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన అడిషనల్ కలెక్టర్ ధోత్రే వెంకటేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చంద్రకాంత్, సపారే మోహన్, భోశా శంకర్, రావుత్ నాగేందర్, రవికుమార్ ఏక్బోటే తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ వాచర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న అమ్రాబాద్ డివిజన్ ఫారెస్టు వాచర్లు

అమ్రాబాద్: అమ్రాబాద్ ఫారెస్టు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వాచర్లకు ఉద్యోగ భద్ర కల్పించాలని ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో అరణ్య భవనంలో రాష్ట్ర ముఖ్య అటవి సంరక్షణ అధికారి రామలింగంను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఉద్యోగ భద్రత కల్పించేందుకు శాఖాపరంగా సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వాచర్లు శివ, విష్ణు, శేఖర్, అంజి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో 15మందికి గాయాలు



ముందుభాగం నుజ్జునుజ్జయిన వాహనం

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు, క్రూజర్(జీపు) ఎదురెదురుగా ఢీ కొనడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన వటువర్లపల్లి గ్రామం సమీప అటవీ సరిహద్దు ప్రాంతం రాసుమోళ్లబావి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకునేందుకు జహీరాబాద్, హైదరాబాద్‌లోని ఆర్సీపురానికి చెందిన రెండు కుటుంబాల వారు క్రూజర్‌లో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో డ్రైవర్‌తో పాటు క్రూజర్‌లో ప్రయాణిస్తున్న సత్యనారాయణ, గణేష్, కార్తిక్, నాగేష్, హరీశ్వర్, చంద్రకళ, లక్ష్మి, రుచిత, సరితతో పాటు 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్ సహాయంతో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చంద్రకళ, సరిత, లక్ష్మి, నగేష్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈగలపెంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు కార్లు ఢీ..



రోడ్డుపక్కన చెట్టును ఢీకొని ఆగిన కారు

దోమలపెంట: నల్లమలలోని శ్రీశైలం, హైదరాబాద్ ప్రధాన రహదారిలో ప్రమాదవశాత్తు సోమవారం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్న చిన్న గాయాలయ్యాయి. ఈగలపెంట పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీశైలం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో వెళ్తున్న వారు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా వేగంగా ప్రయాణించడంతో కారు ముందు టైర్ పేలింది. ఎదురుగా హైదరాబాద్ నుంచి శ్రీశైలం వస్తున్న కారును ఢీకొని, రోడ్డు దిగి చెట్టును ఢీకొట్టి ఆగిపోయింది. ఈ సంఘటనలో రెండు కార్లలో ప్రయాణిస్తున్న వారందరికీ చిన్నపాటి గాయాలయ్యాయి.

వర్షాకాలం.. రైతన్నలూ జాగ్రత్త



అలంపూర్: ఖరీఫ్ పంటకాలం ఆరంభమైంది. వర్షాలు ఆలస్యంగా కురుస్తున్నాయి. ఈ తరుణంలో పిడుగులు పడటం, ఈదురుగాలులు, పాములు బారినపడటం వంటి విషయాల్లో రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని వ్యవసాయ ఏడీఏ సక్రియ నాయక్ పేర్కొన్నారు.

మేఘాలు ఢీకొనడంతో పిడుగులు, మెరుపులు

వ్యతిరేక విద్యుత్ ఆవేశాలు ఉన్న రెండు మేఘాలు ఢీకొనడం వల్ల విద్యుత్ జనించి తక్కువ విద్యుత్ ఆవేశం ఉన్న మేఘం నుంచి ఎక్కువ ఆవేశం ఉన్న మేఘంలోకి విద్యుత్ ప్రవాహం వేగంగా జరుగుతుంది. అది వెంటనే ఉరుములు, మెరుపుల రూపంలో బయటికి వస్తుంది. కాంతికి వేగం ఎక్కువ కావడం వలన మెరుపు ముందుగా కనిపించి ఆ తర్వాత ఉరుము వినిపిస్తోంది. ఎక్కువ విద్యుత్ ఆవేశం ఉన్న మెరుపు తక్కువ ఆవేశం గల భూమి వైపునకు వస్తుంది. తేమ విద్యుత్ వాహకంగా పని చేయడం వలన అది పిడుగుగా మారి ఎత్తైన ప్రదేశాల వైపు దూసుకపోయి భూమిలోకి తటస్థంగా వెళ్తుంది. సహజంగా భూమిపై చెట్లు ఎత్తుగా ఉండటంతో వాటిపై పిడుగు పడుతుంది.

జాగ్రత్తలు..

➡ వర్షాకాలంలో ఉరుములు, మెరుపులు పిడుగులు పడుతుంటాయి. అలాంటి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలి.

➡ ఆకాశం మేఘావృతం అయినప్పుడు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.

➡ వర్షంలో తడవకుండా ఉండటానికి చాలామంది చెట్లను ఆశ్రయిస్తారు. అది సరైంది కాదు. పిడుగులు ఎక్కువగా చెట్లపైనే పడతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం మంచిది.

➡ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలు ఉన్న ప్రాంతాల్లో ఉండరాదు.

➡ సెల్‌ఫోన్లు ఉంటే వాటిని స్విచ్‌ఆఫ్ చేసుకోవాలి.

నడకదారిలో విష సర్పాలు..

వర్షాలు కురవగానే పాములు బయటికి వస్తాయి. గట్ల వెంట, చెట్లు, పిచ్చి మొక్కలు, బండరాళ్లు, గడ్డి వాములు ఉన్నచోట పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. రైతులు పొలం పనులకు వెళ్లే సమయంలో ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు..

➡ చీకటి సమయాల్లో పూర్తిగా చార్జింగ్ చేసిన టార్చిలైట్ తప్పనిసరిగా తీసుకెళ్లాలి.

➡ చేతిలో కర్రను పట్టుకుని వెళ్లాలి.

➡ తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలి. బూట్లు ధరిస్తే ఇంకా మంచిది.

➡ పొలం గట్లపై నడుస్తున్నప్పుడు చప్పుడు చేసుకుంటూ వెళ్లాలి.

➡ పాము కాటుకు గురైతే తక్షణమే సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందాలి.

➡ నాటు వైద్యంపై ఆధారపడవద్దు

వాగులు.. వరద ఉధృతి..

వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తాయి. వ్యవసాయ పనులకు వెళ్లే దారిలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి రైతులు పొలాల నుంచి వచ్చే సమయాల్లో ఇలాంటి పరిస్థితి ఎదురైతే చాకచక్యంగా వ్యవహరించాలి.

జాగ్రత్తలు..

➡ నీటి ఉధృతి ఎలా ఉందో ముందుగా గమనించాలి.

➡ ఒంటరిగా వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయరాదు.

➡ తోటి రైతులతో కలిసి వెళ్లాలి.

➡ ఎతువులను దాటించే సమయాల్లో మరింత జాగ్రత్త అవసరం

పైన కూరగాయలు, కింద రేషన్ బియ్యం



పోలీసుల అదుపులో మినీ డీసీఎం

పెబ్బేరు: డబ్బు సంపాదనే లక్ష్యంగా కొందరు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ సోమవారం పోలీసులకు చిక్కారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపిన వివరాలు... కర్నూల్ జిల్లా నుంచి గోపాల్‌నాయక్ ఏపీ 31టిఏ 9799 నంబర్ గల మినీ డీసీఎంలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం నింపి బియ్యంపై కూరగాయల బాక్స్‌లు వేసుకుని బాలనగర్‌కు తరలిస్తుండగా, పక్కా సమాచారంతో పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు సోమవారం తెల్లవారుజామున పెబ్బేరు సమీపంలో డీసీఎంను పట్టుకున్నారు. బాలనగర్ మండలం కుచర్లతండాకు చెందిన డ్రైవర్ గోపాల్‌నాయక్, అనంతపురం జిల్లా ధర్మవరంలో ఉంటూ అదే గ్రామానికి చెందిన గిరి అనే వ్యక్తితో కలిసి చుట్టుపక్కల గ్రామాలలో ప్రజల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని బాలనగర్, షాద్‌నగర్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈవిషయం తెలియడంతో సివిల్ సప్లయ్ అధికారులు డీటీ వేణు, నందకిశోర్ డీసీఎంలో ఉన్న బియ్యాన్ని పరిశీలించి రేషన్ బియ్యంగా గుర్తించారు. డ్రైవర్ గోపాల్‌నాయక్, గిరిపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాల భవనంపై నుంచి పడి.. విద్యార్థినికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: పాఠశాల భవనం పైనుంచి కిందపడి విద్యార్థినికి గాయాలు అయ్యాయి. జిల్లాకేంద్రంలోని బండ్లగేరిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఐశ్వర్య సోమవారం సాయంత్రం మొదటి అంతస్తు నుంచి ఫిట్స్ రావడంతో హఠాత్తుగా కిందపడిపోయింది. దీంతో విద్యార్థి తలకు గాయాలయ్యాయి. దీనిపై స్కూల్ నిర్వాహకుడు నర్సింహులును వివరణ కోరగా విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి బాగుందని, మెరుగైన చికిత్స అందించడానికి హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ సీఐ సైదులు పేర్కొన్నారు.

కంటోన్మెంట్ల ఏరియాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తాం

సాక్షి, న్యూఢిల్లీ: కంటోన్మెంట్ల సివిల్ ఏరియాలను సంబంధిత మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖంగా ఉందని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి అజయ్‌భట్ తెలిపారు. కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలు, దానికి ఆనుకుని ఉన్న రాష్ట్ర మున్సిపల్ ప్రాంతాలను నియంత్రించే పురపాలక చట్టాలలో ఏకరూపకతను తీసుకురావడానికి కొన్ని కంటోన్మెంట్లలోని పౌర ప్రాంతాలను తొలగించాలన్నారు. దీంతో వాటిని పొరుగు మున్సిపాలిటీలతో విలీనం చేయాలని నిర్ణయించినట్లు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రకారం విధివిధానాలపై అభిప్రాయాలను తెలిపేందుకు ప్రతిపాదనలను రాష్ట్రాలకు పంపినట్లు తెలిపారు.

'మార్గదర్శి' డిపాజిట్‌దారుల సొమ్ము ఏమైంది?

సాక్షి, న్యూఢిల్లీ: మార్గదర్శి చిట్‌ఫండ్స్ డిపాజిట్‌దారుల సొమ్ముకు సంబంధించి ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏం జరిగిందో చూడాల్సి ఉందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. వేర్వేరు శాఖల నుంచి ప్రధాన కార్యాలయానికి సొమ్ము తరలించడం సాధారణమేనని, అదే విధంగా ఈ కేసులోనూ జరిగిందని చెబుతున్న నేపథ్యంలో ప్రధాన కార్యాలయానికి వెళ్లిన సొమ్ము ఏమైందోనన్న అంశంపై ఆలోచిస్తున్నామని పేర్కొంది. మార్గదర్శి కేసుల న్యాయపరిధిపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనల అనంతరం ధర్మాసనం తదుపరి విచారణ ఆగస్టు 4కు వాయిదా వేసింది.

రాక్షసులపై విజయం

- పేదల కోసం మూడేళ్లుగా పెత్తందారులతో మీ బిడ్డ పోరాటం: ఏపీ సీఎం జగన్
- పేదలకు స్థలాలివ్వకుండా, ఇళ్లను కట్టనివ్వకుండా ఎన్నో ఆటంకాలు
- ఎంతో సంఘర్షణ, ఎన్నెన్నో అవరోధాలను అధిగమించి ఇవాళ 50,793 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్నాం
- ఇకపై అమరావతి మనందరిది.. 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా

పేద వర్గాలపై పెత్తందారుల దోపిడీలను సహించి భరించే కాలం పోయింది. ఈ మార్పు ఇక మీదట రాజకీయాలను శాసిస్తుంది. అలాంటి మార్పులకు మనసా వాచా కర్మణా సహకరించే ప్రభుత్వంగా, మీ అన్నగా.. నిరుపేద అక్కచెల్లెమ్మల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనతో 'సామాజిక అమరావతి'కి పునాదిరాయి వేస్తున్నా. ఇక నుంచి అమరావతి మనందరిది.

– సీఎం జగన్



గుంటూరు జిల్లా కృష్ణాయపాలెంలో ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: పేదలకు మేలు జరిగే ప్రతి విషయంలో మనందరి ప్రభుత్వానికి, చంద్రబాబు పెత్తందారుల కూటమికి మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు మంచి జరగకూడదని రాక్షస బుద్ధితో అడ్డుకుంటున్న వారితో పెద్ద యుద్ధమే చేస్తున్నామన్నారు. సోమవారం సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు 50,793 ఇళ్ల నిర్మాణం, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు శంకుస్థాపన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో సీఎం జగన్ మాట్లాడారు. తొలుత తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి గుంటూరు జిల్లా కృష్ణాయపాలెం లేఅవుట్ వద్దకు చేరుకున్న సీఎం జగన్ శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం వెంకటపాలెం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ మంజూరు పత్రాలు అందించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే...

ఆ తర్వాత కూడా బుద్ధి మారలేదు..

సీఆర్‌డీఏలో నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద కుటుంబ సభ్యులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా, ఇళ్లు కట్టించకుండా చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సృష్టించిన ఊరుపేరూ సంఘాలు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ – 5 అడ్డు తగిలాయి. వీరంతా మొదట పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు వీల్లేదన్నారు. ఇందుకోసం ఏకంగా హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లిన దౌర్భాగ్యమైన పరిస్థితిని మన రాష్ట్రంలో మాత్రమే చూస్తున్నాం. ఈ పెద్దమనుషులు, పెత్తందార్లు, పేదల వ్యతిరేకులంతా హైకోర్టులో 18 కేసులు, సుప్రీం కోర్టులో 5 కేసులు వేశారు. ఈ కేసులను పరిష్కరించేందుకు మీ తరఫున మీ బిడ్డ మూడేళ్ల పాటు పోరాటం చేస్తూ వచ్చాడు. దేవుడు, ప్రజల చల్లని ఆశీస్సులు ఎప్పుడూ మంచికే ఉంటాయి. హైకోర్టు, సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే కేసులు గెలిచింది. అనుమతులు తెచ్చుకుని మీకు ఇళ్ల పట్టాలు ఇచ్చాం. ఆ తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ఆపలేకపోయారు కాబట్టి పేదల ఇళ్ల నిర్మాణానికి అడ్డు తగిలేందుకు అన్ని ప్రయత్నాలూ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో వారు ఎక్కని గడప దిగని గడప లేదు. కలవని కేంద్ర మంత్రీ, కేంద్ర సెక్రటరీలు కూడా లేరు. ఇంతమందిని కలిశాక చివరి ప్రయత్నంగా మళ్లీ హైకోర్టులో కేసు వేశారు. ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడూ ఎక్కడా ఉండదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేటి బీజేపీ మహాధర్నా వాయిదా

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని బీజేపీ వాయిదా వేసింది. రాబోయే మూడు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలిగించకూడదన్న ఉద్దేశంతో మహాధర్నాను వాయిదా వేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మహాధర్నాను నిర్వహించబోయే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

శాంతిభద్రతలను కాపాడలేకపోతే ఎలా?

- మాట్లాడే హక్కును ఎవరూ అడ్డుకోలేరు
- పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం
- బీజేపీ ధర్నాకు గ్రీన్‌సిగ్నల్



సాక్షి, హైదరాబాద్: అర్హులైన పేదలకు వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేయాలన్న డిమాండ్‌తో మంగళవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించనున్న ధర్నాకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీలకు ఆదేశాలు జారీ చేసింది. ధర్నాలో 500 మంది మాత్రమే పాల్గొనేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఆ వివరాలను సోమవారం సాయంత్రం 6 గంటల కల్లా అధికారులకు సమర్పించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతించకుంటే మరి ఎక్కడ చేయాలి?.. మాట్లాడటం అనేది ప్రజల ప్రాథమిక హక్కు, దానిని ప్రభుత్వం అడ్డుకోలేదని తేల్చిచెప్పింది. పోలీసులు శాంతిభద్రతలను కాపాడలేకపోతే ధర్నాకు హాజరయ్యే ప్రజలకు పాస్‌లు జారీ చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆదేశించింది. 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ధర్నాకు శాంతిభద్రతల పేరుతో పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ప్రధాన కార్యదర్శి డి.ప్రదీప్‌కుమార్ సోమవారం హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ ధర్నాలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు. దాదాపు 1000 మంది హాజరయ్యే ఈ ధర్నాకు అనుమతి ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. పిటిషన్‌ను జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రచనారెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం ఎంతో ఘనంగా ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం పారదర్శకంగా అమలు కావడం లేదన్నారు. అర్హులకు ఇళ్లు ఇవ్వడం లేదని, నిర్మాణంలోనూ అవకతవకలు జరుగుతున్నాయని.. అందుకే బాటసింగారంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పరిశీలనకు వెళ్లిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని పోలీసులు అడ్డుకున్నారని పేర్కొన్నారు. కాగా, వెయ్యి మందితో ధర్నా నిర్వహిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని హోం శాఖ జీపీ రూపేందర్ చెప్పారు. ఇందిరాపార్కు వద్ద కొద్ది రోజుల క్రితం స్టీల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిందని.. అది ఇంకా ప్రారంభం కూడా కాలేదని, ధర్నాకు అనుమతి ఇస్తే బ్రిడ్జి దెబ్బతినే అవకాశం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి, ధర్నాకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

'సోమేశ్ తీర్పు'నే వర్తింపజేయాలి

కేడర్ వివాదంపై హైకోర్టులో కేంద్రం వాదనలు • మా వాదనలు కూడా వినాలన్న పిటిషనర్లు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది జనవరి 10న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలనే డీజీపీ అంజనీకుమార్ సహా 12 మంది ఆలిండియా సర్వీస్ అధికారులకు వర్తింపజేయాలని కేంద్రం వాదనలు వినిపించింది. 13 మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. అయితే సోమేశ్ కుమార్‌తో కేడర్‌కు సంబంధించిన అంశాల్లో పలు వ్యత్యాసాలు ఉన్నాయని, తమ వాదనలు కూడా వినాలని పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. 2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన నేపథ్యంలో కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ నివేదిక ప్రకారం ఏఐఎస్ ఉద్యోగుల విభజన జరిగింది. నాటి నుంచి ఐఏఎస్, ఐపీఎస్‌ల కేడర్ వివాదం సాగుతోంది. విభజన సమయంలో పలువురు అధికారులను ఏపీకి కేటాయించారు. అయితే వీరిలో కొందరు ఈ కేటాయింపులపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించి తెలంగాణలో విధులు నిర్వహించేలా ఉత్తర్వులు పొందారు. క్యాట్ ఉత్తర్వులను కేంద్ర ప్రభుత్వం తప్పుబడుతూ.. తెలంగాణ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేసింది. కేడర్, సర్వీస్ సహా ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్న దృష్ట్యా విడివిడిగా విచారణ జరపాలని డీజీపీ అంజనీకుమార్ సహా అధికారులు కోరడంతో విచారణను సీజే ధర్మాసనం మరో బెంచ్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లపై సోమవారం జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. సోమేశ్‌కుమార్ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. రివ్యూ పిటిషన్‌లో తుది ఉత్తర్వులు వచ్చే వరకు 13 మంది పిటిషన్ల విచారణను వాయిదా వేయాలని కోరారు. ఈ సందర్భంగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ ఓ పరిశీలన నివేదికను కోర్టుకు అందజేశారు. దీని ప్రకారం అంజనీకుమార్, రొనాల్డ్ రాస్, జె.అనంత రాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి కాటా, అభిలాషా బిస్త్ కేసులు సోమేశ్‌కుమార్ కేసు విశ్లేషణతో సరిపోతాయని, వారికి జనవరి తీర్పును వర్తింపజేయాలని డీఎస్‌జీ కోరారు. మిగతా వాటిపై విడిగా విచారణ చేపట్టవచ్చని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ కేసుల పరిశీలనకు సమయం పడుతుందంటూ, విచారణను ఆగస్టు 7కు వాయిదా వేసింది.

హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక విద్యార్థి ఆత్మహత్య

వికారాబాద్ జిల్లా బొర్రహేమ్యా తండాలో ఘటన

కుల్కచర్ల: హాస్టల్‌లో ఉండటం ఇష్టంలేక ఓ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఈ సంఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. కుల్కచర్ల మండలం బొర్ర హేమ్యాతండాకు చెందిన హీరమన్, శాంతిబాయి దంపతుల కుమారుడు వినోద్(15) స్థానిక పాఠశాలలో ఇటీవల ఏడో తరగతి పూర్తిచేశాడు. కొద్దిరోజుల క్రితం తల్లిదండ్రులు అతన్ని పటాన్‌చెరులోని గిరిజన ఆశ్రమపాఠశాలలో చేర్పించారు. అక్కడ ఉండటం ఇష్టంలేని బాలుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడు. సెలవులున్నాయని ఇటీవల ఇంటికి వచ్చిన అతన్ని తిరిగి హాస్టల్‌కు పంపించేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వినోద్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

గోదారికి పోలవరం అడ్డంకి

- పోలవరం అథారిటీకి స్పష్టం చేసిన తెలంగాణ
- ఆ ప్రభావం తెలంగాణలో స్పష్టంగా కనిపిస్తోంది
- అందుకే గతేడాది రాష్ట్రంలో ముంపు ప్రభావం
- ప్రాజెక్టు గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచాలని లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ముందు నాటి పరిస్థితులతో పోల్చితే ప్రాజెక్టు నిర్మించిన తర్వాత తెలంగాణ భూభాగం పరిధిలో గోదావరి నది స్వేచ్ఛా ప్రవాహాన్ని కోల్పోయిందని, పోలవరం అడ్డంకిగా మారిందని తెలంగాణ రాష్ట్రం మళ్లీ ఆందోళన వ్యక్తం చేసింది. దీని ప్రభావం భద్రాచలం వద్ద గోదావరిలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. గతేడాది సెప్టెంబర్ 6న సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకుని గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం తెలంగాణ భూభాగంలో ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జల సంఘానికి మరో సారి తెలంగాణ రాష్ట్రం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ నెల 21న లేఖ రాశారు. పోలవరం 48 గేట్లను ఏడాది పొడవునా తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతేడాది గోదావరికి వచ్చిన వరదలతో తెలంగాణలోని భద్రాచలం, పరిసర గ్రామాల పరిధిలోని 28వేల ఎకరాలు ముంపునకు గురయ్యాయని గుర్తు చేశారు. స్పిల్‌వే, ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తికావడమే దీనికి కారణమన్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను నిర్ధారించేందుకు జాయింట్ సర్వేను నిర్వహించాలని మరోసారి పీపీఏను కోరారు.

తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం



అయిజ: పట్టణంలోని పాతబస్టాండ్‌-కొత్త బస్టాండ్ మధ్య పెద్దవాగులో కుప్పకూలిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్‌లకు మరమ్మతులు నిర్వహించి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని మిషన్ భగీరథ ప్రాజెక్టు ఎస్ఈ జగన్‌మోహన్ అన్నారు. సోమవారం సంఘటనా స్థలానికి మిషన్ భగీరథ ఎస్ఈతోపాటు ప్రాజెక్టు మేనేజర్ చంద్రమోహన్, వాటర్ గ్రిడ్ డీఈ నాగరాజు, ఏఈ రమేష్, మున్సిపల్ ఏఈ గోపాల్ చేరుకున్నారు. కుప్పకూలిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, పైప్‌లైన్‌కు మరమ్మతులు నిర్వహించి త్వరగా తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని అన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

చేపవ్యాధుల నిర్ధారణ కేంద్రం ప్రారంభం



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మత్స్య కళాశాలలో ఏర్పాటు చేసిన చేపవ్యాధుల నిర్ధారణ, రైతు సమాచార కేంద్రాలను సోమవారం పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రవిందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపరీక్ష కేంద్రాలు చెరువు నిర్మాణం, నాణ్యత (మట్టినీరు చేపపిల్ల) సాగు సమయంలో నీటి నాణ్యత ఉష్ణోగ్రత, నీటిని పరీక్షించవచ్చని తెలిపారు. మత్స్య రైతులు చేపలపై సమస్యలు ఉంటే కళాశాలలో డీన్ డాక్టర్ నాగలక్ష్మి, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వివిధ చేప, రొయ్య విలువ ఆధారిత ఉత్పతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ నాగలక్ష్మి, పరీక్ష కేంద్రం ఇన్‌చార్జ్ హానినంద, అనూష, ముత్తప్పఖవి, భానుప్రకాష్, దేవానంద్ ఉన్నారు.

ఆర్‌యూబీ పనులు షురూ..



జడ్చర్ల రైల్వే స్టేషన్ దగ్గర చురుగ్గా సాగుతున్న ఆర్‌యూబీ నిర్మాణ పనులు

- పూర్తయితే అంతరాయం లేకుండా రాకపోకలు
- ఎన్నో ఏళ్లుగా స్థానికుల ఎదురుచూపులు
- ఎట్టకేలకు ప్రారంభమైన పనులు..

జడ్చర్ల: జడ్చర్ల రైల్వే స్టేషన్ వద్ద ఆర్‌యూబీ (రోడ్ అండర్ బ్రిడ్జి) నిర్మాణం పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇక్కడ ఆర్‌యూబీ పూర్తయితే ప్రజల రాకపోకలు అంతరాయం లేకుండా చేసుకోవచ్చు. పాతబజార్ వైపు ఆర్‌యూబీ పనులు మొదలయ్యాయి. పనుల్లో వేగం పెంచి రెండు వైపులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత రైల్వే అధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

శాశ్వతంగా గేట్ మూత..

ఇక్కడున్న రైల్వే గేట్‌ను రెండేళ్ల క్రితమే శాశ్వతంగా రైల్వే అధికారులు మూసివేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజల రాకపోకలు ఇబ్బందిగా మారాయి. పాతబజార్ ప్రజలతో పాటు బూరెడ్డిపల్లి, ఆలూరు, యాసాయకుంట తండా వాసులు సైతం రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో వీరంతా రాకపోకలకు సిగ్నల్‌గడ్డ మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది.

వ్యాపారం పడిపోయింది..

ఈ ప్రాంతంలో రాకపోకలు బంద్ కావడంతో వ్యాపారం దెబ్బతిన్నది. కూరగాయలు, కిరాణం, హోటళ్లు, తదితర వ్యాపారాలు పడిపోయాయి. రైల్వేగేట్ అవతల కూరగాయల మార్కెట్ ఉండడంతో ప్రజల రాకపోకలు లేక వ్యాపారం పూర్తిగా పడిపోయింది.

ఇన్నాళ్లకు కల ఫలించింది..



ఎన్నో ఏళ్లుగా ఆర్‌యూబీ కోసం ఎదురు చూస్తున్నాం. ఇన్నాళ్లకు కల ఫలించింది. ఆర్‌యూబీ నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలి. పనులు పూర్తయితే రాకపోకలకు వీలవుతుంది.

–రాజు గౌడ్,పాతబజార్,బాదేపల్లి

చుట్టూ తిరగాల్సి వస్తోంది..



ఆర్‌యూబీ పూర్తికాకపోవడంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో తిరిగి వెళ్లేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఆర్‌యూబీ నిర్మిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో వెసులుబాటు ఉంటుంది. త్వరగా ఆర్‌యూబీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకరావాలి.

– నర్సిములు, పాతబజార్, బాదేపల్లి

ఎట్టకేలకు పనులు..

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఆర్‌యూబీ నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమై, నాలుగు మాసాలుగా చురుకుగా సాగుతున్నాయి. పనుల్లో వేగం పెంచి పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంతో కాలంగా ఎదురుచూపులు..

రైల్వే స్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ నిర్మించాలని స్థానికులు నాలుగు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. మొదట ఆర్‌ఓబీ నిర్మించాలని ప్రతిపాదనలున్నాయి. అప్పట్లో సీఎం వైఎస్‌ఆర్ అందుకు రూ.32 కోట్లు నిధులు కూడా మంజూరు చేశారు. ఆర్‌ఓబీ నిర్మిస్తే తమ ఇళ్లు, దుకాణాలు కూల్చివేయాల్సి వస్తుందని అప్పట్లో ఈ ప్రాంతంలోని యజమానులు నిరాకరించారు. దీంతో ఆర్‌ఓబీ నిర్మాణం కాస్త అటకెక్కింది. తర్వాత ఇక్కడికొచ్చిన దక్షిణ మధ్య రైల్వే అధికారులకు, పాలకులకు ఆర్‌యూబీ నిర్మించాలని స్థానికులు వినతిపత్రాలు సమర్పించారు.

ఆర్టీసీ యూనియన్లను పునరుద్ధరించాలి

- టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి



మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీలో యూనియన్లను పునరుద్ధరించాలని, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులు ముందుండి పోరాడారని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి థామస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు తాయిలాలు ప్రకటిస్తున్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు మానసిక ఒత్తిడికి గురై బతుకుతున్నట్లు తెలిపారు. 2015 పీఆర్‌సీ అమలుచేయాలని, ఏరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సీసీఎస్‌కు చెందిన రూ.11వేల కోట్లను ఆర్టీసీ యాజమాన్యం వాడుకున్నదని, వెంటనే ఇవ్వాలన్నారు. సీసీఎస్‌లో ఆర్టీసీ కార్మికులు డబ్బును దాచుకున్నారని, కార్మికులకు అవసరమైనప్పుడు రుణాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఆర్టీసీ ఉద్యోగంలో చేరిన వెంటనే రెగ్యులర్ చేయాలని, మూడేళ్ల కన్సాలిటేడ్ వద్దన్నారు. ఆర్టీసీలో కార్మికులకు శ్రమదోపిడి చేస్తున్నారని, 12 గంటల వరకు పనిచేయించుకుంటున్నారని ఆరోపించారు. దీనిని టీఎంయూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులకు 2021 జూన్ నుంచి పెండింగ్ బకాయిలు ఉన్నాయన్నారు. రోజుకు రూ.20 కోట్లు వస్తున్నాయని యాజమాన్యం చెబుతున్నదని మరి సీసీఎస్‌కు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులపై సవతితల్లి ప్రేమ చూపవద్దని, కార్మికులకు రావాల్సిన రెండు పీఆర్‌సీలు, బకాయిలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం టీఎంయూ రీజియన్ సమావేశం నిర్వహించగా రాష్ట్ర నాయకులు మాట్లాడారు. సమావేశంలో టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, కమలాకర్‌గౌడ్, యాదయ్య, జీఎల్‌గౌడ్, కొండన్న, వహీద్, విజయ్‌బాబు, వెంకటయ్య, బసప్ప, సుందర్, సత్యశీలారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకున్నది కాంగ్రెస్సే..



పెద్దగడ్డతండాలో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: పేదలను ఆదుకున్నది కాంగ్రెస్ పార్టీయేనని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పెద్దగడ్డతండా, ఖానాపూర్, కొర్రతండా మీదుగా ప్రజాహిత పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆయనకు ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. అందుకు ఉదాహరణ తండాలో కూలడానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి మన ఊరు- మనబడి పథకంలో కలర్‌వేసి వదిలేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీసీ బంధు, మైనార్టీబంధు వంటివి తీసుకువచ్చి ఓటర్లను ప్రభావితం చేసేందుకు బీఆర్ఎస్ చూస్తుందని ఆరోపించారు. మీ బిడ్డగా సమస్యల్ని తెలుసుకునేందుకు ముందుకు వచ్చానని, నన్ను ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఒకేసారి రూ.2లక్షలు రుణమాఫీ, రైతు బంధు ఎకరానికి రూ.15వేలు, కౌలు రైతుకు రూ.12వేల పెట్టుబడిసాయం, నిరుద్యోగ యువతకు రూ.4వేల భృతి, ఇతర పథకాలు అమలు చేస్తామన్నారు. ఆయన వెంట సర్పంచ్ శేఖర్‌గౌడ్, కృష్ణయ్య, కృష్ణయ్యగౌడ్, వెంకట్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లను తక్షణం అప్పగించాలి



మాట్లాడుతున్న డీకే అరుణ

- బీజేపీ నేత డీకే అరుణ

గద్వాల: పేదల సొంతింటి కలను నిజం చేస్తామని డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం పేరిట హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఆరోపించారు. డిప్ ద్వారా ఇళ్లు కేటాయించిన లబ్ధిదారులకు ఇళ్లు ఎందుకు అప్పగించడం లేదని ప్రశ్నించారు. రాజకీయ పబ్బం కోసం ఇళ్లు అప్పగించకుండా లబ్ధిదారులను మాయ చేస్తున్నారని మండిపడ్డారు. దీన్ని నిరసిస్తూ సోమవారం పాతబస్టాండ్ చౌరస్తాలో బీజేపీ ధర్నా చేపట్టింది. పెద్దసంఖ్యలో లబ్ధిదారులు ధర్నాకు తరలివచ్చారు. ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నానుద్దేశించి డీకే అరుణ మాట్లాడారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలన్ని నాసిరకంగా ఉన్నాయని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలను బూచిగా చూయించి గత ఎన్నికల నుంచి బీఆర్ఎస్ నాయకులు ప్రజలను దగా చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల కోసం గజం స్థలంకూడా సేకరించలేదని, ఒక్కరికి కూడా ఇళ్ల పట్టా ఇవ్వలేదని మండిపడ్డారు. డిప్‌లో ఇళ్లు తగిలిన లబ్ధిదారులకు ఇప్పటికీ ఇవ్వకుండా రాజకీయ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. తన హయాంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను దౌర్జన్యంగా లాక్కొని, ఆ స్థలంలో నర్సింగ్ కళాశాల కడుతున్నారని మండిపడ్డారు. డిప్ ద్వారా కేటాయించిన ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కొంతమంది నాయకులు ప్రజాసేవ మరిచి, డబ్బు సంపాదనే లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజలకు భరోసా కల్పించి, వారికి అండగా ఉండటానికే బంగ్లా ఉందని చెప్పారు. కొంతమంది నాయకులు బంగ్లాపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు పనులు చేసిన వారిని బంగ్లా నుంచి ఎప్పుడో పంపించేశామని చెప్పారు. దేశంలో సుస్థిరపాలన, అన్ని వర్గాల సంక్షేమం ప్రధాని మోదీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, రాజగోపాల్, రామాంజనేయులు, కుమ్మరి శ్రీను, బండల వెంకట్రాములు, బండల పద్మావతి, కృష్ణవేణి, జయశ్రీ, అనిత, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.